క్లుప్తంగా

ట్రస్ట్ సేవలు అభినందనీయం

ములుగు రూరల్ : నిరుపేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం విద్యార్థులకు అవసరమయ్యే నోట్‌బుక్స్, ఇతర సామాగ్రి అందిస్తున్న డీఎస్ ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎంఈఓ సామల శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక సీఎస్ఐ పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల విద్యార్థుల ప్రగతి, నివేదికలను పరిశీలించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దొడ్డ ప్రతాప్‌రెడ్డిని అభినందించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.12 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుమలత, ట్రస్ట్ సభ్యులు వేణుమాధవరెడ్డి, చిరంజీవి, ఉపాధ్యాయులు రమేష్, రతన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టేకు కలప పట్టివేత



పలిమెల: సుమారు రూ.2.5 లక్షల విలువగల టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు పలిమెల ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటేశ్వర రావు తెలిపారు. పలిమెల మండల పరిధిలోని పలిమెల, సర్వాయిపేట అటవీ ప్రాంతాల్లో దాచిఉంచిన టేకు కలపను పట్టుకున్నట్లు ఆయన వివరించారు. దాడుల్లో పలిమెల, సర్వాయిపేట ఎఫ్ఎస్ఓలు జలింమ్సా, క్రిష్ణ, రాజేందర్, ఎఫ్‌బీఓలు కే.శ్రీనివాస్, పర్లపల్లి రమేష్, పెద్దిల్లి రమేష్, త్రివేణు, సదానందం, నాగరాజు, రాజశేఖర్, విఠల్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన



చిట్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు తమ ఉపాధిని కోల్పోతున్నారని, ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మండలంలోని చల్లగరిగలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత ప్రయాణంతో ఎక్కువ మంది మహిళలే ప్రయాణం చేస్తున్నారని, దీంతో ఆటోలో ప్రయాణించే వారే లేకుండా పోయారని వాపోయారు. జీవనోపాధిని కోల్పోతున్న ఆటోడ్రైవర్లను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాయిరాం ఆటో యూనియన్ అధ్యక్షుడు కందికొండ శంకర్, ప్రధాన కార్యదర్శి క్యాతం కుమారస్వామి, ఉపాధ్యక్షులు శ్రీపతి మొగిళి, కరుణాకర్, సురేందర్, శివ, రాజు, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మొద్దు



మల్హర్: కష్టించి పండించిన పంటలను రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మొద్దని తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దుబ్బపేట, ఎడ్లపల్లి, అన్సాన్‌పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్సాన్‌పల్లి సర్పంచ్ జగన్ నాయక్, మల్లారం ఎంపీటీసీ అవిరినేని ప్రకాష్‌రావు, ఎడ్లపల్లి ఉపసర్పంచ్ తోట రాజేశ్వర్‌రావు పీఏసీఎస్ డైరెక్టర్లు సుంకు రామన్న, బానోతు సర్వనాయక్, నాయకులు జంగిడి శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లభించని యువకుడి మృతదేహం

మంగపేట: మండలంలోని కమలాపురంలో దహన సంస్కార కార్యక్రమానికి వెళ్లి గోదావరిలో స్నానం చేస్తున్న సమయంలో గల్లం రామిశెట్టి రాము అనే యువకుడి ఆచూకీ శనివారం రాత్రి వరకు లభ్యం కాలేదు. గల్లంతైన వెంటనే స్పందించిన స్థానిక ఎస్సై రవికుమార్ నాటు పడవలు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో వాజేడు, మంగపేట మండలాల్లోని గజఈతగాళ్లతో మృతదేహాన్ని వెతికిపట్టేందుకు ఎస్సై చర్యలు తీసుకున్నా లాభం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా మృతదేహం లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన ఎస్సై సైకి డైవర్లు, ఈతగాళ్లను మోహరించి మృతదేహం లభ్యం అయ్యేంత వరకు గాలిస్తామని, కుటుంబ సభ్యులు అధైర్యపడొద్దని సముదాయించారు.

ఐదు గ్రామాలకు నరకయాతన



అధ్వానంగా నాగులమ్మ ఒర్రె వద్ద రోడ్డు



ధ్వంసమైన చెల్పాక రోడ్డు

- రోడ్డు మార్గం సక్రమంగా లేక నిలిపిన ఆర్టీసీ సర్వీసులు
- నడకమార్గం లేక ఎడ్లబండ్లలోనే..

ఏటూరునాగారం : ఆ ఐదు గ్రామాలకు రవాణా నరకయాతన కనిపిస్తోంది. రోడ్డుమార్గం సరిగాలేక ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. మారుమూల గ్రామాలకు రవాణా మార్గం లేక నానా అవస్థలు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని చెల్పాక, బన్నాజీబంధం, వీరాపురం, అల్లంవారిఘణపురం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు ప్రధాన రోడ్డు మార్గం అధ్వానంగా మారడంతో ప్రయాణం నరకంగా మారింది. ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఎక్కడ చూసినా అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి.

ఆపద వస్తే అంతే...

రాత్రి వేళలో ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. గతంలో వేసిన రోడ్డు ఇటీవల జరిగిన వరదలతో కొట్టుకుపోయింది. కల్వర్టుల వద్ద మీటరు లోతులు గోతులు పడి వాహనాలు దిగబడుతున్నాయి. ఒక వాహనం వెళితే మరో వాహనానికి అవకాశం లేదు. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, ఆటోల్లో అరచేతిలో పెట్టుకొని ఆ గిరిజన గ్రామాల ప్రజలు ప్రయాణాలను సాగిస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

పట్టించుకోని ఐటీడీఏ

గతంలో ఐటీడీఏ ద్వారా ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ కింద రూ.5 కోట్లతో రోడ్డు నిర్మాణాలు చేపట్టి ఐదేళ్లు గడిచాయి. అప్పటి నుంచి ఆ రోడ్డు అంతా కూడా ధ్వంసమై ప్రమాదభరితంగా మారింది. ఎక్కడ ఏ గొయ్యి ఉందో అర్థం గానీ పరిస్థితి ఉంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు, మహిళలు ఈ రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు.

రోడ్డు నిర్మించాలి



గుంతలమయంగా మారిన రోడ్డును వెంటనే నూతన రోడ్డు నిర్మించాలి. రైతులు వ్యవసాయ పనిముట్లు, ఎరువులు తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. కూలీలు వేరే ప్రాంతాలకు వెళ్లలేక ఉపాధి కోల్పోతున్నారు. వెంటనే రోడ్డు నిర్మించి ఆదుకోవాలి

బోడ శంకర్, చెల్పాక ఏటూరునాగారం.

గిరిజనులను ఆదుకోవాలి



వరదల వల్ల కల్వర్టులు కొట్టుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. వాటిపై నుంచి వాహనాలు వెళితే కుంగిపోతుంది. దీంతో వాహనాలు కూరుకుపోయి బయటకు వెళ్లలేకుండా ఉంటుంది. కల్వర్టులు నిర్మించి గిరిజన ప్రజలను ఆదుకోవాలి.

కాపుల సమ్మయ్య, అల్లంవారిఘణపురం, ఏటూరునాగారం

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు



సామాజిక ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

- సామాజిక తనిఖీల్లో వెల్లడి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్న విషయం సామాజిక తనిఖీలో వెల్లడైంది. శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ప్రొసీడింగ్ అధికారి నాగపద్మజ హాజరయ్యారు. 1-11-2021 నుంచి 31-3- 2023 వరకు ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులపై సామాజిక బృందాలు గ్రామాల పంచాయతీల వారీగా నిర్వహించి తనిఖీలో వెల్లడైన లోపాలను తనిఖీ బృందాలు సామాజిక ప్రజావేదికలో వివరించారు. బయ్యక్కపేట, నార్లాపూర్, కాల్వపల్లి, కాటాపూర్, తాడ్వాయి గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు వెల్లండించారు. మస్టర్‌లో కూలీల సంతకాలు లేకుండా బిల్లులు చెల్లించినట్లు, రోడ్ల వెంట నాటిన మొక్కలకు నీళ్ల పోసినట్లు గ్రామపంచాయతీల్లో రిజిస్టర్ మెయింటనెన్స్ చేయకుండానే బిల్లులు చెల్లించినట్లు వివరించారు. బయ్యక్కపేటలో ఉపాధి పని ముగిసిన కూలీలతో పనులు చేయించారని రెండేళ్ల నుంచి కూలీలు వేతనాలు చెల్లించకపోవడంతో నష్టపోయారని ప్రజావేదికలో అధికారులకు వివరించారు. కూలీలు పనులు చేయకున్నా చేసినట్లుగా మస్టర్‌లో సంతకాలు పెట్టించి అక్రమంగా డబ్బులు చెల్లించినట్లు వెల్లడైంది. మస్టర్ పూర్తి చేసిన తర్వాత కూడా సంతకాలు లేకుండా కూలీలకు వేతనాలు చెల్లించిన విషయం బయటపడింది. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం పక్కన బెట్టడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులే ఉపాధి హామీ పనులు చేయించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల లోపంతోనే అక్రమాలు చోటు చేసుకున్నాయని సామాజిక ప్రజావేదికలో వెల్లడైంది. పనుల్లో అవకతవకలపై పంచాయతీ కార్యదర్శులను, టెక్నికల్ అసిస్టెంట్లను అధికారులు అడిగి ప్రశ్నలకు వారి నుంచి సరైన సమాధానాలు రాలేకపోయాయి. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతారహితంగా విధులు నిర్వర్తించాలని పీడీ నాగపద్మజ సూచించారు. పంచాయతీల్లో ఉపాధి పనులకు సంబంధించిన నాలుగు రకాల రికార్డులను మెయింటనెన్స్ చేయాలన్నారు. సామాజి తనిఖీలోని అవకతవకలపై పీడీ తీవ్ర స్థాయిలో మందలించారు. ఉపాధి పనుల్లో లోపాలు జరిగితే సహించేది లేదన్నారు. ఉపాధి పనులకు డిమాండ్ పెట్టి కూలీలకు పనులు కల్పించాలన్నారు. మండలంలో మొత్తం రూ. 4,17,24,111 కోట్లకు గాను రూ. 3, 65,43, 040 కోట్ల పనులు చేసినట్లు తెలిపారు. తనిఖీలోని అవకతవకలను గుర్తించి పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ. 14,500 రికవరీ చేయనునున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ గొంది వాణిశ్రీ, అడిషనల్ డీఆర్‌డీఓ బాలకృష్ణ, ప్రాజెక్టు మేనేజర్ రాజశేఖర్, ఎస్‌టీఎం వేణు, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ కిషోర్, ఎస్ఎల్‌పీ సుశీల, ఏపీఓ అనిల్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై కేసు నమోదు చేసిన పోలీసులు

వెంకటాపురం(కె): మైనర్ బాలలకు వాహనాలను నడిపేందుకు ఇస్తే కఠినచర్యలు తీసుకుంటామని, పిల్లల తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రలోని శివాలయం సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్‌ప్లేట్ లేని 15 ద్విచక్రవాహనాలపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకొని నంబర్ ప్లేట్ పొందాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని అన్నారు. ఎల్లో నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను కిరాయిల నిమిత్తం ఉపయోగించినట్‌లైతే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



సరుకులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సునీల్

ఎస్ఎస్‌తాడ్వాయి: టీం కేర్ షేర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర అన్నారు. శనివారం ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడ్వాయి, నర్సింగాపూర్, ఇందిరానగర్, కామారం గ్రామాల్లో 25 మంది పేద కుటుంబాలకు 24 రకాల నిత్యావసర సరుకులు, చలి దుప్పట్లు ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు 25 కిలోల సన్నబియ్యంతో పాటు 24 రకాల సరుకులను పంపిణీ చేయడం చాలా సంతోషకరమన్నారు. పేదలకు ఉపయోగపడే మరిన్ని సేవలను అందించేందుకు ఫౌండేషన్ వారు ముందుకు రావాలని కోరారు. ఫౌండేషన్ సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరుకులు తీసుకున్న పేదలు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనుమాండ్ల రాజిరెడ్డి, కేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ మండల కమిటీ ఎన్నిక



నూతన ఎన్నికైన టీఎన్జీవోస్ మండల కమిటీ సభ్యులు

ఏటూరునాగారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం టీఎన్జీవోస్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. టీఎన్జీవోస్ ములుగు జిల్లా కార్యదర్శి పోలురాజు ఆధ్వర్యంలో ఏటూరునాగారం యూనిట్ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ముసుకు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మువిన్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా రజిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రేణుక, పబ్లిసిటీ సెక్రటరీ భిక్షపతి, ఈసీ సభ్యులుగా రియాజ్‌ఖాన్, భానుప్రకాష్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్జీటీఎస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వరరావు, కోశాధికారి భూక్య లాలూనాయక్, మహిళా అధ్యక్షురాలు చైతన్య, ములుగు యూనిట్ కార్యదర్శి ప్రదీప్, సురేష్, రమాదేవి పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఎల్‌డీఎం తిరుపతి, కీర్తిరెడ్డి

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం అందించే బ్యాంకు పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఎల్‌డీఎం తిరుపతి అన్నారు. శనివారం స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారి కోసం కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధాని బడుగు బలహీన వర్గాల కోసం ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, సుకన్య యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, విశ్వకర్మ యోజన పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అలాగే రైతులు పండించే పంటలకు ఎరువులను సైతం సబ్సిడీలో అందిస్తూ రైతుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, స్థానిక సర్పంచ్ పూర్ణచందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి రవి, గ్యాస్ ఏజెన్సీ రజిత, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు లింగంపెల్లి ప్రసాద్ రావు, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్, రాజు, రవీందర్, శ్రీకాంత్, ప్రవీన్, జగదీష్, కిశోర్, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



స్వామి వారికి పడి తీసుకెళ్తున్న శ్రీనుబాబు

కాటారం: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకొని ఆధ్యాత్మికత దిశగా అడుగులు వేయాలని శ్రీ పాద ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్య ంలో అయ్యప్ప మాలధారణ స్వాములకు అన్నదా నం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. స్వాములతో కలిసి పడి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనుబాబును శాలువాతో స న్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని స మ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు రాజు, గురుస్వాములు రామకృష్ణరావు, సత్యం పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాల ధారణ స్వాములు ఘనంగా మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఆలయ అర్చకులు, గురుస్వామి రవీంద్రాచారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా ములుగు డీఎస్పీ రవీందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాస్, సంపత్, సుధాకర్‌లతో పాటు 200 మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా శోభన్



వెంకటాపురం(ఎం): కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా గునిగంటి శోభన్‌ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని తాటివనంలో మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా కోటగిరి సురేందర్, తడుక రవీందర్, ప్రధాన కార్యదర్శిగా పచ్చిమట్ల రమేశ్, కార్యదర్శిగా కారుపోతుల సత్యం, సహాయ కార్యదర్శులుగా సర్వేశం, బీష్మా, కోశాధికారిగా పులి రమేష్, గౌరవ అధ్యక్షుడిగా దొమ్మాటి రాజసమ్మయ్య, సలహాదారుడిగా రాజమొగిలి, సభ్యులుగా విజయ్, సాంబయ్య, రవిందర్, రాజులు ఎన్నికైనట్లు వెల్లడించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేయాలన్నారు. ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కాశిందేవిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బొక్క సత్తిరెడ్డి

ములుగు రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కాశిందేవిపేట, కన్నాయిగూడెం, సర్వాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకూడదని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మర్రి రాజు యాదవ్, డైరెక్టర్లు వేల్పూరి సత్యనారాయణ, ముస్కల రమేష్, సీఈఓ తిరుపతి పాల్గొన్నారు .

ఉపాధ్యాయులను నియమించాలి



ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వాజేడు: తమ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామస్తులు శనివారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఎంపీయూపీఎస్ జగన్నాథపురం పాఠశాలలో 99 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే బోధిస్తున్నారని తెలిపారు. దీంతో తమ పిల్లలకు పూర్తి స్థాయిలో విద్య అందడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు అందుబాటులో లేని కారణంగా కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చి ఫోన్ ద్వారా ఆయన దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన సోమవారం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

అభివృద్ధి కోసం కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుభద్ర

మహాముత్తారం : అభివృద్ధి కోసం సంయుక్తంగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎంపీపీ సుభద్ర అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మండల కేంద్రంలో అధికారులు వివిధ శాఖల అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంపీఓ శ్రీనివాసరావు, బ్యాంక్ మేనేజర్ సంతోష్‌కుమార్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయంలో ఆదివారం నుంచి జనవరి 15 వరకు ధనుర్మాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాలయంలో నెల రోజుల పాటు వైష్ణవ సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామాలయంలో ఉత్తరద్వార దర్శనం ఉదయం 5.20 గంటలకు కల్పించనున్నారు. జనవరి 14న ఉదయం 10.30 గంటలకు గోదారంగనాయికల కల్యాణం నిర్వహించున్నామని ఆయన తెలిపారు.

18న సుబ్రహ్మణ్య షష్టి..

కాళేశ్వరాలయంలోని అనుబంధ దేవాలయమైన శ్రీసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఈనెల 18న సుబ్రహ్మణ్యషష్టి సందర్భంగా ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.